

సత్యసాయి ఎయిర్‌పోర్టు రన్‌వే

జిల్లావాసుల విమానం కల నెరవేరనున్న వేళ..

పుట్టపర్తి నుంచి పౌరవిమాన సేవలకు ప్రభుత్వాల చర్యలు

దేశవిదేశాలతో ఏర్పడనున్న ఎయిర్ కనెక్టివిటీ


ఆశలకు రెక్కలు..

పుట్టపర్తి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుని జిల్లా అభివృద్ధి దిశగా దూసుకెళ్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా వైపు పారిశ్రామిక దిగ్గజాలు తొంగిచూస్తున్నారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, శిల్పకళాక్షేత్రం లేపాక్షి, పెనుకొండ వద్ద అంతర్జాతీయ కియ కార్ల కంపెనీ ఏర్పాటుతో ఇటీవల ఉమ్మడి జిల్లా నుంచి విమానయానం చేసేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. విమానయానం చేయాలంటే కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి, లేదంటే హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఆయా విమానాశ్రయాలకు చేరుకోవాలంటే విమానచార్జీల కంటే ఎయిర్ పోర్టులకు చేరే ప్రయాణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి రోజూ వందలాది మంది దేశవిదేశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలో శ్రీసత్యసాయి విమానాశ్రయం ఉన్నా.. ప్రైవేటు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న నేపథ్యంలో పౌరవిమానయాన సేవలకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఉమ్మడి జిల్లావాసులు ఇటు కర్ణాటక, అటు తెలంగాణాకు వెళ్లాల్సి



వస్తోంది. కొన్నేళ్లుగా సత్యసాయి ఎయిర్‌పోర్టు నుంచి పౌరవిమానయాన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. తాజాగా రాష్ట్రంలో ప్రస్తుతమున్న ఏడు ఎయిర్‌పోర్టుల సంఖ్యను 14కి పెంచేందుకు ఉన్న అవకాశాలపై సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో ఈనెల 17న ఢిల్లీలో చర్చించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్ పోర్టుగా మార్చే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లావాసుల ఆశలకు రెక్కలు వచ్చినట్లయింది. అన్నీ అనుకున్నట్లు సాగితే ఉమ్మడి జిల్లావాసులకు విమానాశ్రయ కల నెరవేరే వేళ దగ్గర్లోనే ఉంది.

జిల్లాలోనే అందుబాటులోకి..!



విమానంలో ప్రయాణించాలంటే ఉమ్మడి జిల్లావాసులు జిల్లా సరిహద్దుకు 85 కి.మీ. దూరంలో ఉన్న కర్ణాటక రాష్ట్రం దేవనహళ్లి విమానాశ్రయానికి వెళ్లాల్సి వస్తోంది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లావాసులతోపాటు కడప, అన్నమయ్య జిల్లాల ప్రజలు దేవనహళ్లి ఎయిర్ పోర్టు నుంచి అత్యధికంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఆ విమానాశ్రయానికి చేరుకోవాలంటే రానుపోను రవాణా ఖర్చులు రూ.వేలల్లో చెల్లించాల్సి వస్తోంది. జిల్లాలో సత్యసాయి ఎయిర్‌పోర్టు ఉన్నా.. ప్రజలకు ఉపయోగం లేదు. ఉమ్మడి జిల్లాకు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, వీవీఐపీ, వీఐపీలు, భక్తులు, పారిశ్రామికవేత్తలు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఇటీవల సత్యసాయి ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానాలతోపాటు హెలీకాప్టర్ల రాకపోకలు భారీగానే పెరిగాయి. గతేడాది రాయలసీమ జిల్లాల్లో విమానాలతో భూములు, రాష్ట్ర, జాతీయ రహదారుల సర్వే కోసం కొన్ని నెలలపాటు సత్యసాయి ఎయిర్‌పోర్టును వినియోగించుకున్నారు. ఎయిర్‌పోర్టు రన్‌వే 2230 మీటర్ల పొడవు ఉన్న నేపథ్యంలో వాణిజ్య విమానాలు కూడా సునాయాసంగా ల్యాండింగ్, టేకాఫ్ అయ్యే అవకాశం ఉంది. గతంలో ముంబై, చెన్నై వంటి నగరాలకు వారాంతపు ప్రత్యేక సందర్భాల్లో ప్రైవేటు విమాన సర్వీసులు నడిపిన సందర్భాలున్నాయి. ఈనేపథ్యంలో సత్యసాయి ఎయిర్‌పోర్టు పౌరవిమానయాన సేవలకు అనుకూలంగా ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. దీనిని పబ్లిక్ ఎయిర్‌పోర్టుగా మార్చే దిశగా సత్యసాయి సెంట్రల్ ట్రస్టుతో చర్చించాలని భావిస్తున్నాయి. ఆ దిశగా సన్నాహాలు కూడా మొదలెట్టాయి. ఈచర్చలు ఫలిస్తే జిల్లాలోనే పౌరవిమానయాన సేవలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. రెగ్యులర్ సర్వీసులతో దేశవిదేశాలకు ఎయిర్ కనెక్టివిటీ కలిసివస్తుంది.

సత్యసాయి ఎయిర్‌పోర్టు



పండ్ల ఉత్పత్తుల ఎగుమతికి అనుకూలం

ఉద్యాన పంటల ఉత్పత్తులకు ఉమ్మడి జిల్లా పెట్టింది పేరు. రైతులు 40కిపైగా రకాలైన పండ్లను పండిస్తున్నారు. అరటి, చీనీ, మామిడి, బొప్పాయి, టమోటా, దానిమ్మ, కర్బూజా తదితర పంటలు దేశవిదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వీటిలో అరటి, చీనీ, దానిమ్మ పంటలు అరబ్ దేశాలు, నేపాల్, సింగపూర్, మాల్దీవులు తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. రెండేళ్ల కిందట అనంతపురం, తాడిపత్రి నుంచి ప్రత్యేక రైలులో అరటి దిగుబడిని ఎగుమతి చేసిన విషయం విదితమే. ఉమ్మడి జిల్లాలో పండే పండ్లు రుచి పరంగా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. పుట్టపర్తి సత్యసాయి ఎయిర్‌పోర్టు నుంచి విమాన సౌకర్యం కల్పిస్తే జిల్లాలో పండే పండ్ల ఉత్పత్తుల ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లోకి జిల్లా అనుసంధానం, జాతీయ రహదారుల విస్తరణతో ఇక్కడి నుంచి ఎయిర్ కనెక్టివిటీ పెరిగే అవకాశాలున్నాయి.



చిగిచెర్ల వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు



కొంకల్లులో మరణ మృదంగం..!

వరుసగా ఏడుగురి మృతి

అతిసారంతోనే అంటున్న గ్రామస్థులు

సహజ మరణాలే : వైద్య, ఆరోగ్య శాఖ



మల్లికార్జున, బుడ్డ ఓబన్న (ఫైల్)

గుడిబండ/పుట్టపర్తి ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గుడిబండ మండలం కొంకల్లు గ్రామంలో మరణ మృదంగం మోగుతోంది. వరుస మారణాలతో గ్రామస్థులు వణికిపోతున్నారు. అతిసార వ్యాధి లక్షణాలతో ఏడుగురు మృతి చెందడంతో గ్రాయంలో విషాదచాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన యశోదమ్మ (80) ఈనెల 5న చనిపోయింది. ఈనెల 10న తిమ్మక్క (65) మృతిచెందింది. ఆమెను చూడడానికి వచ్చిన తల్లి లక్ష్మమ్మ (86) కూడా అతిసారం బారిన పడి కన్నుమూసింది. గుడదల్లి గ్రామానికి చెందిన రంగమ్మ (85) కొంకల్లు వచ్చి మృతిచెందింది. ఈనెల 16న వాంతులు, విరేచనాల బారినపడిన మల్లికార్జున (62)ను అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 18న మరణించాడు. అదేరోజు బుడ్డ ఓబన్న (82) ఇంటి వద్ద చనిపోయాడు. వారం రోజుల క్రితం సన్నమ్మ (65) మృతిచెందింది. అతిసారం కబళిస్తోందని గ్రామస్థులు భయందోళనలు చెందుతున్నారు. గ్రామంలో అపరిశుభ్రత తాండవిస్తోందని వాపోతున్నారు. మూడేళ్లుగా కొంకల్లు పంచాయతీకి రెగ్యులర్ కార్యదర్శిని కూడా నియమించలేదు. ఇన్‌చార్జి కార్యదర్శితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. తాగునీటి పైపులైన్లు లీకేజీ కారణంగా నీరు కలుషితమై, అతిసారం ప్రబలుతోందని గ్రామస్థులు చెబుతున్నారు. వీటిని వైద్యఆరోగ్యశాఖ సహజ మరణాలే అంటూ కొట్టి పారేస్తోంది.

అన్నీ సహజ మరణాలే

గుడిబండ మండలం కొంకల్లులో ఇటీవల మృతిచెందిన వారంతా సహజ మరణాలే. వయసురీత్యా అనారోగ్యంతో మృతిచెందారు. అతిసారం వ్యాధితో ఎవరూ చనిపోలేదు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశాం. ఇంటింటికీ వెళ్లి రోగుల వివరాలు సేకరిస్తున్నాం. అందరికీ వైద్యసేవలందిస్తున్నాం.

- మంజువాణి, జిల్లా వైద్యాధికారి

పాపం.. పసిగుడ్డు..

ఇసుక తిన్నెలపై నిర్జీవంగా పసికందు



నదిలో కనిపించిన ఆడ శిశువు మృతదేహం

హిందూపురం అర్బన్, ఆగస్టు19: పుట్టిన పసిగుడ్డు నదిలోని ఇసుక తిన్నెలపైకి చేరింది. నిర్జీవంగా పడి ఉంది. మండలంలోని సంతేబిదనూరు వద్ద ఉన్న పెన్నానది వంతెన పక్కన ఆడ శిశువు శవమై, కనిపించింది. సోమవారం తెల్లవారుజామున అటుగా వస్తున్న గ్రామస్థుడు చూసి, చలించిపోయాడు. బిడ్డను పైకి తీసుకొచ్చి వంతెన మీద పడుకోబెట్టాడు. అప్పటికే పసికందు మృతి చెంది ఉంది. విషయం గ్రామస్థులు, రూరల్ పోలీసులకు తెలిపారు. పోలీసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరస్వతి చుట్టుపక్కల గ్రామాల్లో విచారించారు. వివరాలు తెలియలేదు. పసికందు రెండ్రోజుల క్రితం జన్మించి ఉంటుందని అంచనాకు వచ్చారు. ఆ మేరకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో గత మూడు రోజుల్లో కాన్పు అయిన వారి వివరాలు సేకరించి, పోలీసులు విచారిస్తున్నారు. పసికందు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఇసుక తిన్నెలపైకి చేరిన పసిగుడ్డును చూసి స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. అయ్యో.. పాపం.. అంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

పుడమి పులకింత!

పాతాళం నుంచి పరుగున వచ్చిన
గంగమ్మ.. అణువణువూ తడిపేస్తుంటే..
కాడెద్దులు.. నాగలితో దున్నేస్తుంటే..
అన్నదాత పారతో చెక్కుతుంటే..
ఎరువులు చల్లేస్తుంటే..
మహిళలు వరినాట్లు వేస్తూ..
జానపద గేయాలు పాడుతుంటే..
పులకించదా పుడమి..
పచ్చదనాన్ని పరచుకుంటూ..



పాకమానుతో చదును..



పిట్టమడిలో మందులు చల్లుతూ..

ధర్మవరం మండలంలోని చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి, తుమ్మల, తిప్పేపల్లి, రావులచెరువు, గరుడంపల్లి, చింతలపల్లి, బడన్నపల్లి, గొల్లపల్లి తదితర గ్రామాల రైతులు వరి సాగులో బిజీగా ఉన్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బోరుబావుల కింద వరినాట్లు వేస్తున్నారు. ఆ ఫొటోలే ఇవి.. -ధర్మవరంరూరల్

జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా ప్రణాళికలు

కలెక్టర్ చేతన్ ఆదేశం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి, ఆగస్టు 19: జిల్లాలో ఉపాధి అవకాశాలు, ఆదాయం పెరిగి ప్రజల జీవనప్రమాణాలు మెరుగు పరిచేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. అధికారులను ఆదేశించారు. రానున్న ఐదేళ్లకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు 122 వినతులు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే పనులను విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. 1వ తేదీలోగా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, ఆర్డీఓ భాగ్యరేఖ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

డీపీఓలో 25 ఫిర్యాదులు

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తంగా 25 అర్జీలు అందాయి. వాటిని జిల్లా ఎస్పీ రత్న స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్ట పరిధిలో వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నీటి ప్రాజెక్టులకు నీరసం!

జిల్లా ప్రాజెక్టులను పట్టించుకోని గత ప్రభుత్వం

- నిర్వహణకు చిల్లిగవ్వ ఇవ్వని వైనం
- పలు చోట్ల శిథిలావస్థకు చేరుకున్న గేట్లు
- జిల్లా అధికారుల ప్రతిపాదనలు బుట్టదాఖలు
- కూటమి ప్రభుత్వంలో మంచి రోజులు వచ్చేనా?

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: ఇటీవల తుంగభద్ర డ్యాం క్రస్ట్ గేట్ కొట్టుకుపోయిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని నీటి ప్రాజెక్టులపైన సందేహాలు తలెత్తుతున్నాయి. వైసీపీ పాలనలో నిర్వహణకు నిధులు ఇవ్వకపోవడంతో ప్రాజెక్టుల భద్రతపై అనుమానాల రేకెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 12 రిజర్వాయర్లు ఉన్నాయి. ఇందులో హెచ్చెల్సీ కింద పీఏబీఆర్, ఎంపీఆర్, ముచ్చుకోట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, చాగల్లు, సుబ్బరాయసాగర్, పెండేకల్లు రిజర్వాయర్లు ఉన్నాయి. వీటికి తుంగభద్ర డ్యాం నుంచి నీటిని తరలిస్తున్నారు. ఇక హంద్రీ నీవా సుజల స్రవంతి పథకం కింద జీడిపల్లి, గొల్లపల్లి, చెర్లో పల్లి, మారాల రిజర్వాయర్లు నిర్మించారు. శ్రీశైలం నుంచి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను జిల్లాకు తరలిస్తున్నారు. వీటితో పాటు మైనర్ ఇరిగేషన్ పరిధిలో పేరూరులో అప్పర్ పెన్నార్ రిజర్వాయర్, గుమ్మఘట్ట వద్ద భైరవాన్ తిప్ప ప్రాజెక్ట్‌లను నిర్మించారు. ఉమ్మడిజిల్లాకు తాగునీరందంచే మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన సీబీఆర్‌ను కడప జిల్లా అధికారులు పర్యవేక్షిస్తారు. వీటి నిర్వహణకు ప్రతి ఏటా నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తే ఆయా ప్రాజెక్టులు మరింత కాలం మన్నికగా ఉండి ప్రజల అవసరాలు తీరుస్తాయి. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాజెక్టుల నిర్వహణకు పుష్కలంగా నిధులు వస్తే మంచి రోజులు వచ్చినట్లేనని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్ట్‌లను గాని వాటి నిర్వహణను గాని పట్టించుకోకుండా గాలికొదిలేసింది. దీంతో జలవనరుల శాఖ పరిధిలోని రిజర్వాయర్ల నిర్వహణ భారంగా మారింది. ఆర్థిక భారంతో ఇంజనీర్లు పూర్తిగా చేతులెత్తేశారు. నిధులు లేకుండా ప్రాజెక్ట్‌ల నిర్వహణ సాధ్యం కాదని తెగేసి చెప్పేశారు. 2014-19 కాలంలో ప్రాజెక్ట్‌లతో పాటు కాలువల నిర్వహణకు అప్పటి టీడీపీ ప్రభుత్వం జలవనరుల శాఖ అధికారుల ప్రతిపాదనల ప్రకారం నిధులు చెల్లిస్తూ వచ్చింది. అప్పట్లో దాదాపుగా ప్రాజెక్ట్‌ల నిర్వహణలో సమస్యలు ఉత్పన్నం కాలేదు. 2019-24 ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో చిల్లిగవ్వకూడా ప్రాజెక్ట్‌ల నిర్వహణకు నిధులు చెల్లించలేదు. పైగా జలవనరుల శాఖ ఇంజనీర్లు పంపిన ప్రతిపాదనలు చెత్తబుట్టలోకి వేసేశారు. అలా ప్రాజెక్ట్‌ల నిర్వహణను నిర్లక్ష్యం చేసిన ఫలితమే ప్రస్తుతం సందేహాలు తలెత్తడానికి కారణమవుతోంది.

శిథిలావస్థలో ఎంపీఆర్ గేట్లు

హెచ్చెల్సీ కింద మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్)ను 1966లో నిర్మించారు. దీని పూర్తి నిల్వ సామర్థ్యం 5.170టీఎంసీలు. అయితే ప్రస్తుతం 4.5టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేస్తున్నారు. 2014-19 ఐదేళ్ల టీడీపీ పాలనలో ఎంపీఆర్ నిర్వహణకు రూ.5 కోట్ల వరకు వెచ్చించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ పాలనలో రూ.4లక్షలు మాత్రమే ఖర్చు పెట్టారు. ఎంపీఆర్ గేట్లు శిథిలావస్థకు చేరాయి. గేట్లు మార్చాల్సిన పరిస్థితి ఉంది. సుమారు రూ.25కోట్లతో గేట్ల మరమ్మతులు, మార్పులకుగాను హెచ్చెల్సీ అధికారులు ప్రతిపాదనలు పంపారు.

సీబీఆర్ సామర్థ్యం 10 టీఎంసీలు


చిత్రవతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(సీబీఆర్)ను 2002లో నిర్మించారు. దీని పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 10టీఎంసీలు. కడప జిల్లా సరిహద్దు పార్నపల్లి వరకు ఈ నిర్మాణం ఉంది. అయితే ప్రస్తుతం ఆరు టీఎంసీల వరకు మాత్రమే నీటిని నిల్వ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు కదిరి, ధర్మవరం, ముదిగుబ్బ, పుట్టపర్తి ప్రాంతాలకు తాగునీటి అవసరాలను తీరుస్తోంది. అంతేగాక సుమారు 10వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది.

గత ఐదేళ్లలో నిధులు సున్నా

చాగల్లు రిజర్వాయర్ హెచ్చెల్సీ కింద ఉంది. 2012లో 1.5టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. 2015లో పెండేకల్లు రిజర్వాయర్ నిర్మించారు. దీని సామర్థ్యం 0.650టీఎంసీలు. ముచ్చుకోట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 1998లో 0.668 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. సుబ్బరాయసాగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ 1990లో 0.420టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించారు. ఈ రిజర్వాయర్ల నిర్వహణ, గేట్ల మరమ్మతులకు నిధులు అవసరం ఉంది. గత ఐదేళ్లలో ఈ రిజర్వాయర్లకు నిధులు చెల్లించకుండా గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది.

ఎప్పుడూ నిండని పీఏబీఆర్

జిల్లాలో అతిపెద్ద రిజర్వాయర్ పెన్నా అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) 1994లో నిర్మించారు. దీని పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 11టీఎంసీలు. అయితే ఇప్పటి వరకు ఆస్థాయిలో ఎప్పుడూ నీటిని నిల్వ ఉంచలేదు. పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉంచాలంటే మిగిలిన భూసేకరణ చేపట్టి, స్టోరేజీ కెపాసిటీని పెంచాలి. మరో 3వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉంది. పీఏబీఆర్ సామర్థ్యం అంచనా వేసేందుకు టెస్టులకు గాను పూణేకు చెందిన సీడబ్ల్యూసీ కంపెనీ రూ.5 కోట్లు అవసరం అని పేర్కొంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం దీన్ని పట్టించుకోలేదు. 11టీఎంసీల నీటిని నిల్వ చేయడానికి మరో రూ.450కోట్లు నిధులు అవసరం ఉంది. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పీఏబీఆర్ నిర్వహణ, మరమ్మతులకు ఐదేళ్లలో సుమారు రూ.18కోట్ల వరకు వెచ్చించింది. 2019-24 వరకు ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం రూ.10లక్షలు మాత్రమే చెల్లించింది. గేట్ల మరమ్మతులకు అత్యవసరంగా రూ.2కోట్ల వరకు నిధులు అవసరం ఉంది. ఇక పీఏబీఆర్ లీకేజీ మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం వైసీపీ పాలనలోనే ఐదు దఫాలుగా హెచ్చెల్సీ అధికారులు పంపారు. అయినా ఏమాత్రం ఫలితం లేదు.





జలవనరుల శాఖ కార్యాలయం

2001లో యోగివేమన ప్రాజెక్ట్

ముదిగుబ్బ మండలంలో 2001లో యోగివేమన రిజర్వాయర్‌ను నిర్మించారు. దీని సామర్థ్యం 0.900టీఎంసీలు. ప్రస్తుతం 0.839 టీఎంసీల నీటిని నిల్వ చేయగలుగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క పైసా కూడా నిర్వహణకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. ఉన్న 11గేట్లు పూర్తిగా పాడైపోయాయి. గేట్లు మరమ్మతు చేయాల్సి ఉంది. తుప్పుపట్టకుండా గేట్ల నిర్వహణకు ఆయిల్, గ్రీజు, రంగులు వేయాల్సిన అవసరం ఉంది. గేట్లు రిపేరీలో ఉండడంతో నీరు లీకు అవుతోంది.



1961లో బీటీపీ నిర్మాణం

భైరవాన్‌తిప్ప ప్రాజెక్ట్‌ను 1961లో నిర్మించారు. దీన్ని తుంగభద్ర నదికి ఉపనదిగా ఉన్న వేదవతిహగరిపై నిర్మించారు. 1961లో ఆ ప్రాజెక్టుకు బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం సుమారు 4.9 టీఎంసీల నికర జలాలు కేటాయించారు. ఈ ప్రాజెక్టు కింద స్థిరీకరించిన 12వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జీడిపల్లి నుంచి బీటీపీకి కృష్ణా జలాలు తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. 2019లో ప్రభుత్వం మారడంతో అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తే కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో సాగు, తాగు నీటికి ఇబ్బంది ఉండదు.



చెర్లోపల్లి రిజర్వాయర్

- హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు నిర్మించారు. ఇందులో 2018లో టీడీపీ ప్రభుత్వం కదిరి మండలంలో చెర్లోపల్లి రిజర్వాయర్‌ను నిర్మించింది. 1.608టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం 0.337టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన ఐదేళ్లలో గేట్ల మరమ్మతులు, షట్టర్ల నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ ఇవ్వలేదు. గేట్ల మరమ్మతులు, నిర్వహణకు సుమారు రూ.50లక్షలు కావాలని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం అధికారులు ప్రతిపాదనలు పంపారు.
- జీడిపల్లి రిజర్వాయర్ 2012లో నిర్మించారు. 1.681టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన రిజర్వాయర్ నుంచి కిందికి ఎత్తిపోతల ద్వారా నీటిని పంపుతున్నారు.
- మారాల రిజర్వాయర్ 2017లో నిర్మించారు. 0.483టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించారు.
- 2017లో గొల్లపల్లి రిజర్వాయర్ 1.913టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించారు.
- హంద్రీనీవా కింద నిర్మించిన రిజర్వాయర్ల నిర్వహణ గేట్ల మరమ్మతులు, ఆయిల్, గ్రీజ్‌కు అవసరమైన నిధులు గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో నిర్వహణ భారం అధికమైందని ఇంజనీర్లు చెప్పుకొస్తున్నారు.

1958లోనే పేరూరు డ్యాం పూర్తి

పేరూరు అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టు నిర్మాణానికి 1950లో శంకుస్థాపన జరిగింది. 1958లో నిర్మాణం పూర్తి అయింది. ఇందుకోసం రూ.1.86కోట్లు వెచ్చించారు. ఇందులో డ్యాం నిర్మాణానికి రూ.1.33కోట్లు, కాలువ నిర్మాణానికి రూ.25, 54,560, తూములు, పిల్లకాలువలకు రూ.11లక్షలు, హెడ్‌వర్క్స్ మిషనరీకి రూ.11లక్షలు వెచ్చించినట్లు అప్పటి లెక్కల బట్టి తెలుస్తోంది. పేరూరు డ్యాం ఎత్తు 63 అడుగులు కాగా నీలెవల్ 1763 నీటి నిల్వ సామర్థ్యం 1.816 టీఎంసీలు. అయితే దశాబ్దాల పాటు నిరుపయోగంగా ఉండటంతో ప్రాజెక్టులో పూడిక ఏర్పడింది. దీంతో ప్రస్తుతం దాని నీటి నిల్వ సామర్థ్యం 20 అడుగులు తగ్గింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో రామగిరి మండలంలోని కొండాపురం, కంబదూరు మండలంలోని కురాకులపల్లి, కర్ణాటకలోని తిమ్మంపల్లిలో కొంత భాగం ముంపునకు గురైంది. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీడిపల్లి నుంచి కృష్ణా జలాలను తరలించేందుకు నిధులు కేటాయించింది. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిధులు చెల్లించకుండా ఐదేళ్ల పాటు కాలయాపన చేసింది.

ప్రతిపాదనలపై కసరత్తు



ఉమ్మడి జిల్లాలో ఉన్న సాగు, తాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులు, పరిస్థితులపై ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలు పంపేందుకు కసరత్తు చేస్తున్నాం. ప్రాజెక్టుల నిర్వహణ, కాలువల నిర్వహణకు నిత్యం నిధులు అవసరం ఉంది. గత ఐదేళ్లలో ప్రభుత్వానికి నిధుల కోసం పంపిన ప్రతిపాదనలు ఉన్నతాధికా రులు పరిగణలోకి తీసుకోలేదు. దీంతో ప్రాజెక్టుల నిర్వహణ కష్టంగా మారింది. తాజాగా నిధులకు ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో జలవనరుల శాఖ ఇంజనీర్ల నుంచి సమగ్రంగా వివరాలు తీసుకున్న తర్వాత నివేదికలను త్వరలో పంపుతాం.

- నాగరాజ, ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల చీఫ్ ఇంజనీర్ (సీఈ)

శ్రీవారిని దర్శించుకున్న మంత్రి కేశవ్



శ్రీవారి ఆలయం వెలుపల మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, ఆగస్టు 19: కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామిని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో మంత్రి కేశవ్ కుటుంబసమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపంలో టీటీడీ వేద పండితులు ఆయనను ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. మంత్రితో పాటు తెలంగాణ సీఎం రాజకీయ సలహాదారుడు వీ నరేందర్‌రెడ్డి, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర స్వామివారిని దర్శించుకున్నారు.

రేపు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఆగస్టు 19: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు రెవెన్యూ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు.

ఐఏబీ సమావేశం తర్వాతే నీటి విడుదల

- చైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: ఐఏబీ సమావేశంలో చర్చించి హెచ్ఎల్ఎంసీ, జీబీసీ, ఎంపీఆర్ సౌత్‌కెనాల్, నార్త్‌కెనాల్ కింద ఆయకట్టుకు దామాషా పద్ధతిలో విడుదల చేయనున్నట్లు ఐఏబీ చైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్చెల్సీకి, జిల్లాకు 2024-25 సంవత్సరానికి సంబంధించి టీబీ డ్యాం నుంచి 26.368టీఎంసీల నీటిని కేటాయించినట్లు ఐఏబీ చైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 10టీఎంసీల నీరు తాగునీటి అవసరాలకు, మిగిలిన నీరు వ్యవసాయం, కాలువలకు దామాషా పద్ధతిలో కేటాయించ నున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈనెల 10నుంచి హెచ్ఎల్ఎంసీ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న తాగునీటి పథకాలు, నారు మడులు, ఆయకట్టు రైతుల అవసరాలు, ఆయా ఉప కాలువలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

బడ్జెట్‌లో రైల్వేకు అరకొర నిధులు

కేటాయింపులపై పింక్ బుక్ విడుదల చేసిన రైల్వే బోర్డు



గుంతకల్లు రైల్వే స్టేషన్

గుంతకల్లు, ఆగస్టు 19: కేంద్ర ప్రభుత్వం గత నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తమ శాఖకు కేటాయింపులపై రైల్వేబోర్డు పింక్ బుక్‌ను ఆలస్యంగా విడుదల చేసింది. జోన్‌ల వారీగా పింక్‌బుక్‌ను రిలీజ్ చేసింది. దక్షిణ మధ్య రైల్వేకు విడుదలైన నిధుల్లో గుంతకల్లు డివిజన్‌కు అరకొరగా ఫండ్స్ వచ్చాయి.

రైల్వే డివిజన్‌కు వచ్చిన నిధులివే..

డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న నడికుడి-శ్రీకాళహస్తి లైన్‌కు మధ్యంతర బడ్జెట్‌లో రూ. 310 కోట్లు కేటాయించగా, ఆ మొత్తాన్ని జూలై బడ్జెట్‌లో రూ. 450 కోట్లకు పెంచారు. కడప- బెంగళూరు కొత్త లైన్‌కు ఇంటీరియం బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోగా, జూలై బడ్జెట్‌లో రూ.10 కోట్లు ఇచ్చారు. గుత్తి-ధర్మవరం లైన్ బకాయిల కోసం రూ.100 కోట్లు కేటాయించారు. నిర్మాణంలో ఉన్న గుంతకల్లు-గుంటూరు లైన్‌కు ఫిబ్రవరి బడ్జెట్‌లో రూ.283 కోట్లను కేటాయించగా దాన్ని రూ.480 కోట్లకు పెంచారు. రేణిగుంట, వాడి, గుత్తి బైపాస్ లైన్ల బకాయిల కింద ఫిబ్రవరి బడ్జెట్‌లో కేటాయించిన రూ. 83.30 కోట్లను, జూలై బడ్జెట్‌లో యథాతథంగా కేటాయించారు. అకోలా-జీన్ కొత్త లైన్‌కు, ధర్మవరం-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులకు రెండు బడ్జెట్లలోనూ నిధులు ఇవ్వలేదు. గుత్తి-పెండేకల్లు డబ్లింగ్‌కు ఇంటీరియం బడ్జెట్‌లో రూ. 150 కోట్లను కేటాయించగా పూర్తి స్థాయి బడ్జెట్‌లో రూ. వంద కోట్ల కోతపెట్టారు. తిరుపతి శాటిలైట్ స్టేషన్‌కు రూ. 7.41 కోట్లను కేటాయించారు. ఇవికాక ట్రాక్ రెన్యువల్స్, ఆర్‌యూబీలు తదితర పనులకు నిధుల కేటాయింపులు జరిగాయి. వీటిలో డివిజన్‌కు నికరంగా ఏమేరకు నిధులు లభించాయో రైల్వే అధికారులు వెల్లడించాల్సి ఉంది.

ఎన్టీఆర్‌తోనే వాల్మీకులకు రాజకీయ గుర్తింపు

అనంతపురం ఎంపీ అంబికా



ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న కులస్తులు

హిందూపురం, ఆగస్టు 19: రాజకీయంగా వాల్మీకులకు గుర్తింపు తెచ్చింది ఎన్టీఆర్ అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. హిందూపురంలోని వాల్మీకి భవన్‌లో సోమవారం వాల్మీకి ప్రజాప్రతినిధుల ఆత్మీయ సన్మానసభ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అనంతపురం ఎంపీ, ఎమ్మెల్సీలు మధుసూదన్, మంగమ్మ, మునిసిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, పలువురు నాయకులు హాజరయ్యారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ ఎన్టీఆర్ వాల్మీకులను గుర్తిస్తే చంద్రబాబు మనల్ని చట్టసభల్లోకి పంపారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేవరకు పోరాటం చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా సమస్యలను పరిష్కరించుకోవడానికి కలిసి రావాలన్నారు. ముఖ్య మంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలతో కలిసి వాల్మీకి ఫెడరేషన్‌కు రూ.200కోట్లు కేటాయించేందుకు కృషి చేస్తామన్నారు. అమరావతిలో ఐదెకరాల స్థలంలో వాల్మీకి వికాస కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. వాల్మీకి జయంతిని సెలవుదినంగా ప్రకటించాల ని ముఖ్యమంత్రికి విన్నవిస్తామన్నారు. అనంతరం వాల్మీకి ప్రజాప్రతినిధులను కులస్థులు, వాల్మీకి ఉద్యోగ సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షులు శివశంకర్, సీనియర్ నాయకులు దేమకేతేపల్లి అంజినప్ప, వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఏమవుతుందో ఏమో !

- బదిలీలపై గందరగోళం
- గడువు ఇవ్వని జడ్పీ ఉన్నతాధికారులు
- కడప జిల్లాలో 25 వరకూ అవకాశం



అనంతపురం విద్య, ఆగస్టు 19: ఉద్యోగుల సాధారణ బదిలీలు జడ్పీలో గందరగోళానికి, ఆందోళనకు గురి చేస్తున్నాయి. సాధారణ బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన క్రమంలో ఈనెల 19 నుంచి 31లోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఐదేళ్లు ఒకే స్టేషన్‌లో సర్వీసు పూర్తి చేసుకున్న వాళ్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. అయితే ఈనెల 20లోగా బదిలీలకు దరఖాస్తు చేయాలంటూ జడ్పీ అధికారులు గడువు ఇచ్చారు. కాగా ఇతర జిల్లాలో ఎక్కువ రోజులు గడువు ఇచ్చారు. కడప జిల్లాలో ఈనెల 25 సాయంత్రం వరకూ దరఖాస్తుకు గడువు ఇచ్చారు. తక్కువ గడువు ఇవ్వడంపై ఉమ్మడిజిల్లా ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకూ ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగుల వివరాలను సైతం అధికారులు సేకరించలేదు. అయితే ఆరుగురు ఎంపీడీఓలు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నవారి జాబితాలో ఉన్నట్లు తెలిసింది.

రంగంలోకి యూనియన్ నేత...?

బదిలీల నేపథ్యంలో ఓ యూనియన్ నాయకులు రంగంలోకి దిగినట్లు విమర్శలు వస్తున్నాయి. బదిలీల ఉత్తర్వులు రాగానే ఆ ప్రాంతానికి చెందిన యూనియన్ నేత...ఉన్నతాధికారితో తనకు పరిచయం ఉందంటూ...అంగడి తెరిచేందుకు సిద్ధమైనట్లు జడ్పీ ఉద్యోగుల ద్వారా తెలిసింది. ఉన్నతాధికారి యల్లనూరులో పని చేసినప్పుడు బాగా తెలుసునని, ఆ పరిచయంతో కోరుకున్న చోటుకు ప్లేస్ ఇప్పిస్తానంటూ బేరాలకు దిగినట్టు సమాచారం. మరి జడ్పీ ఉన్నతాధికారి, పాలకవర్గం పెద్దలు ఇలాంటి వారి పైరవీలకు చెక్ పెడతారా..? లేక వదిలేస్తారో మరి.

కూలీల వాహనం బోల్తా: 16మందికి గాయాలు

ధర్మవరం రూరల్,(కనగానపల్లి), ఆగస్టు 19: బొలెరో వాహనం బోల్తాపడి 16మంది కూలీలు గాయపడిన సంఘటన సోమవారం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద జరిగింది. మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పెద్దన్న పొలంలో పని చేయడానికి ధర్మవరం మండలం పోతుకుంట, గుట్టకిందపల్లి గ్రామాలకు చెందిన దాదపు 20మంది మహిళా కూలీలు బొలెరో వాహనంలో వచ్చారు. పనులు ముగించుకుని మధ్యాహ్న సమయంలో అదే వాహనంలో మామిళ్లపల్లి నుంచి పోతుకుంటకు బయల్దేరారు. అయితే మామిళ్లపల్లి సమీపంలోనే వాహనం స్టీరింగ్ విరిగి పోయి అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో వాహనం లో ఉన్న కూలీలు చల్లాచెదురుగా పడిపోయారు. పోతుకుంటకు చెందిన పెద్దక్క, రామక్క, ఈరమ్మ, కళ్యాణి, ముత్యాలమ్మ, రామ లక్ష్మి, గంగరత్న, సరస్వతి, అరుణ, నాగరత్న, గుట్టకిందపల్లికి చెందిన రామాంజినమ్మ, మల్లేశ్వరి, కుర్లపల్లి తండాకు చెందిన నారాయణనాయక్, లక్ష్మీనాయక్, బాలకృష్ణనాయక్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108ద్వారా క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో పోతుకుంటకు చెందిన ముత్యాలమ్మ, అరుణలను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



బోల్తాపడిన బొలెరో వాహనం



తీవ్రంగా గాయపడి ప్రమాదస్థలం వద్ద రోదిస్తున్న మహిళా కూలీలు

బాధితులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శ

వాహనం బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డ కూలీలను ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ పరామర్శించారు. గాయపడ్డ కూలీల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్

సంబరంగా రక్షా బంధనం



మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు రాఖీ కడుతున్న మహిళలు

ధర్మవరం/పెనుకొండ టౌన్, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సోమవారం రాఖీ పండుగను ఘనంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా అక్క చెల్లెల్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టి, ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు సైతం రాఖీలు కట్టారు. ధర్మవరంలోని సీఎస్‌బీ ప్యాలెస్‌లో మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు మహిళలు పెద్దసంఖ్యలో రాఖీలు కట్టారు. అమరావతిలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత రాఖీ కట్టి, శుభాకాంక్షలు తెలిపారు.



అమరావతిలో మంత్రి నారా లోకేశ్‌కు రాఖీ కడుతున్న మంత్రి సవిత

భక్తిశ్రద్ధలతో శ్రీగిరి ప్రదక్షిణ

పుట్టపర్తి, ఆగస్టు 19 : శ్రీసత్యసాయి శ్రీగిరి ప్రదక్షణను సోమవారం ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల సమయంలో ప్రశాంతి నిలయం గణేష్ గేట్ వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి భక్తిగీతాలు అలపిస్తూ రథాన్ని లాగుతూ గిరిప్రదక్షణ నిర్వహించారు. గోకులం, గణేష్ కూడలి, పెట్రోలు బంకు, చింతతోపు, గోవిందపేట, శివాలయంవీధి, సత్యమ్మ ఆలయం, గోపురం మీదుగా తిరిగి గణేష్ వద్దకు చేరుకుంది. మహా మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలు అందచేశారు.



గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న సాయిభక్తులు

జీఓ నంబర్ 117 రద్దు చేయాలి

మంత్రి సత్యకుమార్‌కు ఏపీటీఎఫ్ నాయకుల వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 19 : విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టులా మారిన జీఓ నంబర్ 117, 128లను వెంటనే రద్దుచేసేలా చొరవ చూపాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి ఈ విషయాన్ని మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరు శ్రీనివాసులు, ఆర్‌చంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ టీకే ముత్యాలప్ప, సీనియర్ నాయకులు రవీంద్రారెడ్డి, చంద్ర, వాసుకుమార్, శ్రీనివాసులు, ప్రసాద్, హేమంత్‌కుమార్, శ్రీరాములు, శ్రీనివాసులు, సుదర్శన్, జగదీశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు జీవన భృతి కల్పించండి

కదిరి అర్బన్, ఆగస్టు 19: ఉద్యోగ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు జీవన భృతి కల్పించాలని విశ్రాంత ఉద్యోగులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను సోమవారం విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ముందు కడపకు వచ్చిన నారా చంద్రబాబునాయుడు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు జీవన భృతి కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గోపాల్‌క్రిష్ణ, బాషా, సురేంద్రరెడ్డి, హరిమోహన్, శ్రీరాములు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

ధర్మవరం రూరల్, ఆగస్టు 19: కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో సోమవారం బోలేరా వాహనం బోల్తా పడటంతో మండలంలోని పోతుకుంట, గుట్టకిందపల్లి గ్రామాలకు చెందిన 16 మంది మహిళకూలీలు గాయపడ్డారు. ధర్మవరం ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతున్న వీరిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి వేర్వేరుగా ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు.

అత్తింటి వేధింపులతో మహిళ ఆత్మహత్య



భువనేశ్వరి (ఫైల్)

ధర్మవరం, ఆగస్టు 19 : స్థానిక గాంధీనగర్‌లో అత్తింటి వారి వేధింపులు తాళలేక భువనేశ్వరి (30) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానిక రాజేంద్రనగర్‌కు చెందిన చింతా లక్ష్మీదేవి, లేట్‌నాగరాజుల కుమార్తె భువనేశ్వరి (30). గాంధీనగర్‌కు చెందిన గుండా ఓబులేసు, అలివేళమ్మ కుమారుడు విశ్వనాథ్‌తో ఆరేళ్ల క్రితం భువనేశ్వరికి వివాహమైంది. వీరికి కుమార్తె లాస్య, కుమారుడు కార్తీక్ ఉన్నారు. సోమవారం ఉదయం ఇంటిలోని ఓ గదిలో భువనేశ్వరి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయాన్ని విశ్వనాథ్ భువనేశ్వరి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి వచ్చి తమ కుమార్తె మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తమ అమ్మాయి ఆత్మహత్యకు అత్త, భర్త వేధింపులే కారణమని మృతిరాలి తల్లి, బంధువులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

నల్లమాడ: మండలంలోని చెరువువాండ్లపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిదేవి (62) పాము కాటుతో సోమవారం మరణించింది. చెరువువాండ్లపల్లిలో గంగప్ప, లక్ష్మీదేవి కూలిపనులు చేసుకుని జీవించేవారు. రోజులాగానే సోమవారం కూడా లక్ష్మిదేవి ఓ రైతు పొలంలోకి వేరుశనగ పంటను తొలగించడానికి వెళ్లింది. చెట్లు తొలగిస్తుండగా పాము కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు ఆమెను వెంటనే నల్లమాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మరణించినట్లు చెప్పారు. లక్ష్మిదేవికి భర్త, కుమారై ఉన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

ధర్మవరం, ఆగస్టు 19 : స్థానిక చంద్రన్న ప్రెస్‌క్లబ్‌లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం శిల్క్‌సిటీ ఫొటో అండ్ వీడియో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫొటోగ్రాఫర్లు హరి, ఆర్‌కే మూర్తి, రామచంద్ర, అంబిక శ్రీనివాసులను సన్మానించారు. అనంతరం గొట్లూరు అనాథాశ్రమంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు రాము, రామానాయుడు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 19: జిల్లా పోలీసు కార్యాలయంలో కానిస్టేబుల్ కమలాకర్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. సోమవారం జిల్లా ఎస్పీ రత్న తన చాంబర్‌లో ఆ కానిస్టేబుల్ భార్య ముత్యాలమ్మకు రూ. 75 వేలు, విడోఫండ్ కింద రూ. 50 వేలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ. 25 వేల చెక్కులను అందచేశారు. ఆ కుటుంబానికి రావాల్సిన ఇతర ఆర్థిక సహాయాన్ని కూడా త్వరలోనే అందిస్తామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత, ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో బలరామ జయంతి వేడుకలు



ధర్మవరం రూరల్: స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలో ఇస్కాన్ మందిరంలో శుక్రవారం బలరామ జయంతిని పురస్కరించుకుని జగన్నాథుడు, బలరామ, సుభద్ర ప్రతిమలకు విశేషపూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ప్రతిమలను విశేషంగా అలంకరించారు. హరినామ సంకీర్తనలు చేశారు.



ధర్మవరం కాకతీయ విద్యానికేతన్‌లో రాఖీలు కడుతున్న విద్యార్థినులు

ఉత్సాహంగా రక్షాబంధన్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 19: జిల్లావ్యాప్తంగా రక్షాబంధన్‌ను సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ ఈ వేడుకలను నిర్వహించారు. ఓం శాంతి బ్రహ్మకుమారీలు ఎస్పీ రత్న, అదనపు ఎస్పీ విష్ణుకు రాఖీలు కట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ పోలీసు అధికారులు, సిబ్బందికి రాఖీలు కట్టి మిఠాయిలు పంచారు.

పుట్టపర్తి: స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అనంతపురంలోని తన నివాసంలో మడకశిరా ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు రాఖీ కట్టారు. అదేవిధంగా ఓం శాంతి బ్రహ్మకుమారీలు జిల్లాకేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి సిబ్బందికి రాఖీలు కట్టారు.

టీడీపీ కార్యాలయంలో...

ధర్మవరం : రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలుగు మహిళలు పెద్దఎత్తున స్థానిక టీడీపీ కార్యాలయానికి సోమవారం తరలివచ్చి నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌కు రాఖీలు కట్టారు. పార్టీ మహిళలే కాకుండా పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు, ఇతర వర్గాల వారు శ్రీరామ్ రాఖీ కట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లి మహేశ్‌చౌదరి, పరిశే సుధాకర్, పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్ హుస్సేన్, రాళ్లపల్లిషరీప్, కొత్తపేట ఆది చీమలరామాంజి, చీమలసూరి, తిరుపాల్ పాల్గొన్నారు.

కాకతీయ విద్యానికేతన్‌లో...

స్థానిక కాకతీయ విద్యానికేతన్‌లో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను విద్యార్థులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మల జయచంద్రారెడ్డి, పాఠశాల డైరెక్టర్‌లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజుకు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



ఏఎస్పీకి రాఖీ కడుతున్న ఎస్పీ



పరిటాల శ్రీరామ్‌కు రాఖీ కడుతున్న మహిళలు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

వినాయక చవితి సమన్వయ సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 19: వినాయక చవితి పండుగ నేపథ్యంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గించేలా వ్యవహ రిస్తే.. వారిపై కఠిన చర్యలు తప్పవని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వినా యక చవితి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పండుగను యువకుల కోరిక మేరకు ఏడు రోజులు నిర్వహిం చేలా కృషి చేస్తామని తెలిపారు. వినాయక నిమజ్జనం రోజున కొంతమంది తాగి అల్లర్లు చేస్తారని, అలాంటి వారిని కట్టడి చేయాలని పోలీసులకు సూచించారు. ప్రశాంతంగా... ఉత్సహంగా పండుగను జరుపుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కర్నల్ నిజాం, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి, ఆర్డీఓ వంశీకృష్ణ, డీఎస్పీ శ్రీలత, సమీవుల్లా మౌలాన్, నాగేంద్ర, గంగాధర్ పాల్గొన్నారు.

పత్ర కులస్థులకు ప్రాధాన్యమివ్వాలి

కదిరి లీగల్: ప్రభుత్వం భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టుల్లో పత్ర కులస్థులకు ప్రాధాన్యమివ్వాలని ఆ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.కృష్ణమూర్తి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌ను విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు ఆ కులస్థులతో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పత్ర కులస్థులు 80 శాతం మంది తెలుగు దేశం పార్టీ మద్దతుదారులుగా ఉన్నారని, కావున నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరారు. కదిరిలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి సహకరించాలని వారు విన్నవించారు.

ఇంటి పట్టాలు పేదలకే దక్కాలి : సీపీఎం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ముదిగుబ్బ, ఆగస్టు 19 : మండలంలోని జొన్నల కొత్తపల్లి రెవెన్యూ పొలంలో 51వ సర్వే నెంబర్‌లోని తొమ్మిది ఎకరాల 12 సెంట్లు ప్రభుత్వ భూమిని ఇళ్లపట్టాలుగా పేదల కే కేటాయించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. జొన్నల కొత్తపల్లిలో ప్రభుత్వ భూమిని పేదలకు ఇంటిస్థలాలుగా తహసీల్దార్ కేటాయించారని, రెవెన్యూ అధికారులు సరిహద్దులు కూడా చూపారని అన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడెసెలు వేయడానికి ఆ స్థలంలోకి వెళితే..రాళ్ళ అనంతపురం గ్రామానికి చెందిన కొందరు నాయకులు గతంలో మాకు పట్టాలు మంజూరు చేశారని అడ్డుకు న్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని, పేదలకే ఆ భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని డిప్యూటి తహసీల్దార్ మునిస్వామి హామీ ఇవ్వడంతో నాయకులు శాంతించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహులు, సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, బాబ్జా న్, నౌషాద్, బాబు, లక్ష్మన్న, నారాయణమ్మ పాల్గొన్నారు.

రేపు పరుగు పోటీలు

కొత్తచెరువు, ఆగస్టు 19 : స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు పరుగు పందెం పోటీలు బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి తెలిపారు. ఈ నెల 29న జాతీయ క్రీడాదినోత్సవం నేపథ్యంలో ఈ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం అందుకు సంబంధించిన కరపత్రాన్ని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. విద్యార్థులకు 100, 200 మీటర్ల పరుగు పందెం పోటీలు ఉంటాయని, అండర్ 14, 17విభాగాల్లో వీటిని నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆత్మీయ ట్రస్టు సభ్యులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, నాయకులు వెంకటరమణ, భాస్కర్, లక్ష్మీనారాయణ, బాబు, బాబావలి పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ, యూటీఎఫ్ నాయకులు

విగ్రహాల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

పుట్టపర్తి, ఆగస్టు 19 : జిల్లా కేంద్ర ప్రధాన రహదారిలో సర్వమత దేవతల విగ్రహాల ఏర్పాటుకు సత్యసాయి సెంట్రల్ ట్రస్టు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా సోమవారం మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, సత్యసాయి సెంట్రల్ ఇంజనీరు ప్రుష్టి, ఉమ్మడి రాష్ట్ర సేవాసంస్థల అధ్యక్షుడు చలం, రోడ్లు భవనాల ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి, మునిసిపల్ కమిషనర్ అంజయ్య, అర్బన్ సీఐ సునీత జైజంక్షన్‌ను పరిశీలించారు. పట్టణంలోని హనుమాన్ కూడలి నుంచి రైల్వేస్టేషన్ వరకు కూడళ్లలో బుద్ధుడు, హనుమంతుడు, గురునానక్, జీసస్, శ్రీకృష్ణుడు, షిర్డీబాబా, శ్రీరాముడు, వినాయకుడు, గరుడ విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో రామాంజినేయులు, పీసీ గంగన్న, కడియాల సుధాకర్, శ్రీరామిరెడ్డి, రామారావు, అబ్దుల్, కొత్తచెరువు శ్రీనివాసులు, శ్రీరామనాయక్ పాల్గొన్నారు.



విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ట్రస్టు ప్రతినిధులు, అధికారులు

వైభవంగా శ్రీవారి కల్యాణం

ధర్మవరం, ఆగస్టు 19: పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడామైదానంలో సోమవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని గొర్తి సుధాకర్ నాయుడు, గొర్తి భారతిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష కుంకుమార్చన, లక్ష మల్లెలార్చన నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి పట్టణ ప్రజలేకాకుండా చుట్టు పక్కలగ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇందులో మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి, బీజేపీ నాయకుడు అంబటి సతీశ్ పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం

బాధ్యతలు స్వీకరించిన ధర్మవరం టూటౌన్ సీఐ



ధర్మవరం, ఆగస్టు 19: ధర్మవరం టూటౌన్ సీఐగా రెడ్డప్ప సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ అశోక్‌కుమార్ సత్యసాయి జిల్లా ఎస్పీ అటాచ్ చేశారు. అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్పను ఇక్కడికి బదిలీ చేశారు.

తనకల్లు ఎంపీడీఓ...



తనకల్లు : మండల ఎంపీడీఓగా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎల్‌డీఓ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడి నియమించారు. తలుపుల ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహించేవారు.

ఎన్పీకుంట ఎంపీడీఓ ...

నంబులపూలకుంట : మండల ఎంపీడీఓగా మనోహర్‌బాబు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇతను మండల ఈఓఆర్‌డీగా కొనసాగుతుండేవారు. గతంలో నల్లచెరువు ఎంపీడీఓ రాణేమ్మ ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా కొనసాగింది. ప్రస్తుతం నూతన ఎంపీడీఓగా మనోహర్‌బాబును నియమించారు.

చిరుధాన్యాల సాగు పరిశీలన

తనకల్లు, ఆగస్టు 19 : మండలంలోని పెద్ద ఎద్దులవారిపల్లి వద్ద విశ్రాంత న్యాయాధికారి రెడ్డెప్పరెడ్డి తన పొలంలో జనజాగృతి సహకారంతో సాగుచేస్తున్న చిరుధాన్యాల పంటలను ఏఓ శ్రీహరినాయక్ సోమవారం పరిశీలించారు. పురుగుమందులు, రసాయన ఎరువులు ఉపయోగించకుండా బీజామృతంతో విత్తన శుద్ధి చేసి విత్తుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. మిశ్రమ పంటలు సాగుచేయడం అభినందనీయమన్నారు. చిరుధాన్యాలు కొర్రలు, అలసందలు, అనుప, పెసర, ఆముదాలు సాగుచేస్తుండడం, మేర పంటలుగా సజ్జ, జొన్న సాగుచేయడం మంచి పరిణామన్నారు. మండలంలోని 19 గ్రామాల్లో చిరుధాన్యాల సాగుకు జనజాగృతి ప్రోత్సహం అందించడం హర్షితగ్గ విషయమన్నారు. సంస్థలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు ఉపయోగించుకుని చిరుధాన్యాలవైపు దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట జనజాగృతి సిబ్బంది, రైతులు ఉన్నారు.

అందుబాటులో ఉండని ఆశావర్కర్

తాడిమర్రి, ఆగస్టు 19: మండలంలోని పుల్లంపల్లి గ్రామానికి చెందిన ఆశావర్కర్ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని అదే గ్రామానికి చెందిన అశోక్, నారాయణస్వామి, తదితరులు డాక్టర్ హరితకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆశావర్కర్ మూడు నెలలుగా వారి తల్లిదండ్రుల వద్దనే ఉంటోందని, ఆమె శాశ్వతంగా గ్రామంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని లేదా కొత్తవారినైనా నియమించాలని వారు కోరారు.

కరాటేలో ప్రతిభ

కదిరి అర్బన్, ఆగస్టు 19: హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో ఇటీవల నిర్వహించిన రెండో జాతీయస్థాయి కరాటే చాపియన్‌షిప్ పోటీల్లో కదిరి విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో కదిరి జైన్ పాఠశాల విద్యార్థులు నేహా, శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు మహమ్మద్‌కౌఫ్, రీహాముస్కాన్ బంగారు పతకాలు సాధించారని కరాటే మాస్టార్ షాకీర్ సోమవారం తెలిపారు.



కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కదిరి అర్బన్, ఆగస్టు 19: నిబంధనలు పాటించిన ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ నాయకులు సోమవారం ఎంఈఓ చెన్నక్రిష్ణకు వినతిపత్రం అందించారు. పట్టణంలో పలు పాఠశాలల్లో యూనిఫారం, నోటు పుస్తకాలు విక్రయిస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాలు కూడా లేవన్నారు. అర్హతలేని ఉపాధ్యాయులతో బోధిస్తున్నారని, ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేంద్ర, ఆజేయ్ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 19: కోల్‌కత్తాలో మహిళ జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం పేర్కొన్నారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో జూనియర్ డాక్టర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటచలమయ్య, నాగరాజు, నరసింహులు, ఎమ్మార్పీఎస్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు పరిశీలన

కదిరి, ఆగస్టు 19: తలుపుల మండలం లక్కసముద్రం గ్రామ పరిధిలో ఈక్రాప్ పంట నమోదును ఏఓ షాదబ్ సోమవారం పరిశీలించారు. ప్రతి రైతు ఖరీఫ్‌లో సాగుచేసిన పంటను తప్పకుండా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆయన వెంట వీఏఏ నిఖిల్ , రైతులు ఉన్నారు.



పండ్ల తోటల పెంపకాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 19 : ఉపాధి పథకం కింద పండ్ల తోటల పెంపకానికి టీడీపీ నాయకులు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు సోమవారం మండలంలోని గంగిరెడ్డిపల్లిలో జయచంద్రారెడ్డి పొలంలో భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ పొగాకు షఫీ అహమ్మద్, ఆర్ఎంపీ జాకీర్ మాట్లాడుతూ.. ఆసక్తిగల రైతులు పండ్లతోటల పెంపకానికి ముందుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో ఉపాధి పథకం కింద రైతులను ప్రోత్సహిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ రాజారెడ్డి, రైతు జయచంద్రారెడ్డి, నాయకులు పీరేనాయక్, గంగాద్రి, బడిశం రామాంజనేయులు, సంఘాల శీనా, చంద్రాయుడు, సతీష్, సురేష్, క్షేత్ర సహాయకులు రామాంజనేయులు, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

23న ఉపాధి పనులపై గ్రామసభలు

అగళి, ఆగస్టు 19: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23న ఉపాధిహామీ పథకంపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సమావేశాలు ఉంటాయన్నారు. ఈ నెల 23న నిర్వ హించే గ్రామసభలపై ఎంపీడీఓ సోమవారం సిబ్బందితో సమీక్షించారు.

గోరంట్ల: మండలంలోని 20 పంచాయతీ కేంద్రాల్లో ఈనెల23న గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం ద్వారా నూతన పనుల ఎంపిక, ఆమోదం, అవగాహన కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

హిందూపురం(పరిగి), ఆగస్టు 19 : మండల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులకు సోమవారం పరిగి ఉన్నత పాఠశాలలో రెండోరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎం ఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం పాఠశాలను సందర్శించారు. పరిగి, సేవా మందిరం, ధనాపురం, మోదా పాఠశాలల సముదాయాల సమావేశం ఏర్పాటుచేసి శిక్షణ ఇస్తామన్నారు. మధ్యా హ్న భోజన పథకం పరిశీలించారు.

రొళ్ల : మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈఓ శ్రీధర్ స్కూల్ కాంప్లెక్స్‌పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ బోధన తదితర అంశాలపై వివరించారు. తరగతులలో వెనకబడిన విద్యార్థులకు విద్యాబోధన ఎలా చేయాలనే అంశాలపై ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు.

పాఠశాలలో వైద్య పరీక్షలు

హిందూపురం అర్బన్, ఆగస్టు 19: పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో సోమవారం డాక్టర్ షర్మిలాబేగం, డాక్టర్ సమంతారెడ్డి సహకారంతో పదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, బోధనేతర సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాల అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించా రు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ నందకుమార్, ఏడీ స్మిత, నందిత, హెచ్‌ఎం గాయత్రి, ఏఓ బాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ ఎం శశికళ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

మడకశిర(అమరాపురం), ఆగస్టు 19 : అమరాపురం మండల తహసీల్దార్‌గా సోమవారం మారుతీప్రకాష్ సోమవారం బాధ్యతలు చేప ట్టారు. ఈ స్థానం ఆర్నెల్లుగా ఖాళీగా ఉంది. అయితే ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చొరవతో మండలానికి తహసీల్దార్‌గా మారుతీప్రకాష్‌ను నియమించారు.

నా చాంబర్ ఎక్కడ..? ఎంపీడీఓ అసహనం

అగళి, ఆగస్టు 19 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తన చాంబర్ ఎక్కడ అని మూడు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ రవిప్రసాద్ అసహనం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం విధులకు హాజరయ్యారు. అయితే తనకు చాంబర్ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓకే చాంబర్ లేకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఎన్నికల సమయంలో బదిలీపై వెళ్లి, మళ్లీ ఇక్కడకు ఎంపీడీఓగా వచ్చారు. అయి తే కార్యాలయంలో గతంలో ఉన్న ఎంపీడీఓ చాంబర్‌ను జడ్పీటీసీ ఉమేష్‌కు కేటాయించారు. దీంతో కార్యాలయంలో చాంబర్ లేకపోవడంతో తాను ఎక్కడ ఉండాలో అర్థం కావడం లేదన్నారు. రేపటి నుంచి డ్యూటీకి ఎలా రావాలని, వచ్చినా ఎక్కడ ఉండాలని పేర్కొన్నారు.

తాగునీటి కోసం రోడ్డుపై నిరసన

హిందూపురం(పరిగి), ఆగస్టు 19 : మండల కేంద్రమైన పరిగిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందంటూ బోయ కాలనీ మహిళలు సోమవారం బీరలింగేశ్వరస్వామి ఆలయం సమీపంలో హిందూపురం-మడకశిర ప్రధాన రహదారిపై రాస్తారోకోచేసి నిరసన వ్యక్తం చేశారు. నెలరోజుల నుంచి తాగునీ సమస్య ఉన్నట్లు తెలిపారు. నీటిసమస్యపై పంచాయతీ కార్యదర్శి అరుణను వివరణ కోరగా మూడురో జుల క్రితమే పంచాయతీలో నిధులు లేకపోయినా సొంత ఖర్చులతో మర మ్మతులు చేయించామని ఆకతాయిలు పైపులు ధ్వంసం చేయడంవల్లే నీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో రాస్తారోకో విరమించారు.

భూ తగాదాల్లో ఒకరిపై దాడి

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 19 : మండల పరిధిలోని మేకలపల్లిలో భూతగాదా విషయమై వైసీపీ నాయకులు సోమవారం గ్రామానికి చెందిన జీవీ రామక్రిష్ణ అనే వ్యక్తిపై దాడిచేసి గాయపరిచినట్లు పోలీసులు తెలిపారు. మేకలపల్లి గ్రామస్థుడైన రామక్రిష్ణ 1995లో చిన్నమద్దన్న, హనుమంతు వద్ద 58సెంట్లను రూ.2వేలకు కొనుగోలు చేశాడన్నారు. తనపేరుపై రిజిష్టరు కూడా చేయించుకున్నాడన్నారు. అయితే ఇతను బెంగళూరులో టైలర్ పనిచేస్తూ స్థిరపడ్డాడన్నారు. ఈ క్రమంలో విక్రయదారుల రక్త సంబంధీకులు ఆ భూమికి సంబంధించిన అడంగల్ తమ పేరుపై చేయించుకున్నారన్నారు. ఆ భూమిని తన పేరిట 1బి అడంగల్ మార్చి ఇవ్వాలని కోరుతున్నారన్నారు. ఈ క్రమంలో దాడిచేసి గాయపరిచినట్లు తెలిపారు. రక్తగాయాలతో ఉన్న అతడు అందించిన సమాచారం మేరకు అతడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి బాధితుడిని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భూనిర్వాసితుల ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్నరైతులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 19 : గోరంట్ల మండల సమీపంలోని నాసెన్, బెల్ కంపెనీల కోసం భూములు కోల్పోయిన రైతు కుటుంబాలలోని వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం భూనిర్వాసితులతో కలిసి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాల యం వద్ద నిరసన తెలిపారు. అనంతరం సమస్యలపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... గోరంట్ల, పాలసముద్రం, సోమందేపల్లి, చిన్నబాబయ్యపల్లి, కావేటి నాగేపల్లి గ్రామాలకు చెందిన రైతుల నుంచి 2013లో భూసేకరణ చేపట్టారని, వారందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ స్పందించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో ఈనెల 25న 72గంటల పాటు భూనిర్వాసితులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద వంటా వార్పు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో భూములు కోల్పోయిన బాధితులు పాల్గొన్నారు.

అనుమతి లేని కట్టడాలను రద్దు చేస్తాం

పావగడ, ఆగస్టు 19 : మునిసిపల్ కార్యాలయం నుంచి ఎటువంటి అనుమతి పొందకుండా మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా స్థలాలను స్వాధీనం చేసుకుని అపార్ట్‌మెంట్‌లు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరదరాజులు, మునిసిపల్ ముఖ్య అధికారి జాఫర్ షరీఫ్ తెలిపారు. పావగడ పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట శ్రీనాథ్ అనే వ్యక్తి పురాతన కోటకు ఆనుకుని బోరువాడి తవ్వించడంతో ఇటీవల కురిసిన భారీ వర్షానికి కోటగోడలు కూలిపోయాయని బేకరి నాగరాజు, దండోర నాయకుడు కృష్ణమూర్తి సోమవారం ధర్నా చేపట్టారు. దీంతో అధికారులు స్థలాన్ని సందర్శించారు. అక్రమంగా కట్టిన ఈ కట్టడానికి లైసెన్స్ రద్దు చేస్తామని కూలిన పురాతన కోటను సంబంధిత వ్యక్తి ద్వారా కట్టించడానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వరదరాజు తెలిపారు. దీంతో వారు ధర్నా విరమించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి

పెనుకొండ రూరల్, ఆగస్టు 19 : రొద్దం మండలం చెరుకూరు గ్రామంలో సోమవారం విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతిచెందింది. గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప పాడిఆవులు పెంచుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామ సమీపంలో పాడిఆవులను మేపుకోసం తోలుకెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్‌షాక్‌కు గురై పాడిఆవు మృతిచెందింది. దీంతో రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

కంబాలరాయుడికి జ్యోతుల ఉత్సవం



స్వామి ఊరేగింపులో జ్యోతులు మోస్తున్న మహిళలు

మడకశిర రూరల్, ఆగస్టు 19 : మండలంలోని జిల్లేడగుంట గ్రామంలో వెలసిన కంబాల సనసింహస్వామికి గ్రామస్థులు సోమవారం జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి జిల్లేడగుంట, భక్తరహళ్లి గ్రామాల్లో ఉరేగించారు. స్వామివారి రథంతో పాటు భక్తులు జ్యోతులను నెత్తిన పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో అంతా కంబాల నరసింహస్వామికి జ్యో తులు మోసి మొక్కులు తీర్చుకుంటామని గ్రామస్థులు తెలిపారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

మడకశిరటౌన్: శ్రావణ సోమవారం పురస్కరించుకొని మడకశిర పట్టణంలోని వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలను కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణ సమీపంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి ఆకుపూజ చేశారు. అలాగే పెద్దఎత్తున భక్తులు కాలినడకన కావలికొండను ఎక్కి ఆంజనేయస్వామికి విశేష పూజలు చేసి, మొక్కులను తీర్చుకున్నారు. అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి కుంకుమార్చన తదితర పూజల చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

హిందూపురం అర్బన్: పట్టణ పరిధిలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన ఎల్లమ్మదేవత ఆలయంలో శ్రావణమాసం పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. ఎల్లమ్మ మూల విరాట్‌కు, శివలింగానికి, బసవేశ్వరుడికి పంచామృతాభిషేకం చేశారు. ఎల్లమ్మ దేవతను వెండి కిరీటంతో అలంకరించారు.

పెనుకొండ: శ్రావణ మాసం పురస్కరించుకుని పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





అలంకరణలో మిట్టబండ ఆంజనేయస్వామి, కావలికొండ ఆంజనేయస్వామి



పురంలోని ఎల్లమ్మ దేవత



ఊరేగుతున్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి

ఘనంగా రాఖీ పౌర్ణమి

గోరంట్ల, ఆగస్టు 19: మండల వ్యాప్తంగా సోమవారం రాఖీపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఏటీఎస్ జూనియర్ కళాశాల, ఏఎంకే డిగ్రీ కళాశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ అడవాల సూర్య నారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమా నికి సీఐ శేఖర్ హాజరయ్యారు. గోరంట్లలోని ఓంశాంతి నిర్వాహకులు రజిని, బలరాం గుప్త ఆధ్వర్యంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు రాఖీలు కట్టి, మిఠాయిలు పంచారు.

పెనుకొండ : రక్షాబంధన్‌ను పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారు.స్థానిక సరస్వతి విద్యా మందిరం, అంగన్‌వాడీ కేం ద్రాల్లో పిల్లలు ఒకరికొకరు రాఖీలు కట్టి సోదరభావం చాటుకు న్నారు. బ్రహ్మకుమారీలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అధికారులకు రాఖీ కట్టారు. హిందూపురం పార్లమెంట్ సభ్యుడు బీకే పార్థసారథిని ఆయన స్వగృహంలో కలిసి రాఖీ కట్టారు.

చిలమత్తూరు: రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం తెలుగు మహిళలు శ్రీదేవి, గాండ్రాళ్లపల్లి లక్ష్మీదేవి, వీరాపురం లక్ష్మి మండల అధికా రులకు రాఖీ కట్టి సుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో మహిళల రక్షణ కోసం ఏర్పాటుచేసిన చట్టాలను అమలు చేసి వారిపై జరుగుతున్న అగాయిత్యాలను అరికట్టాలన్నారు.



ఎంపీ పార్థసారథికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



సీఐ శేఖర్‌కు రాఖీ కడుతున్న ఓంశాంతి రజిని



ఎస్‌ఐ మున్సీర్ అహమ్మద్‌కు రాఖీ కడుతున్న తెలుగు మహిళలు



పెనుకొండ అంగన్‌వాడీ కేంద్రంలో రాఖీలు కడుతున్న చిన్నారులు

న్యాయాధికారికి అభినందనలు



న్యాయాధికారికి అభినందనలు తెలుపుతున్న న్యాయవాదులు

హిందూపురం, ఆగస్టు 19 : న్యాయాధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన హిందూపురం అదనపు జిల్లా కోర్టు న్యాయాధికారి కంపల్లె శైలజను పురం బార్ అసోసియేషన్ నాయకులు అభినందించారు. కోర్టు ఆవరణంలో సోమవారం న్యాయాధికారిని కలిసిన న్యాయ వాదులు మాట్లాడుతూ రాయలసీమ నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికకావడం అభినంద నీయమన్నారు. న్యాయాధికారి కంపల్లె శైలజ రెండోసారి ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఏపీపీ ఇందాద్, న్యాయవాదులు గోపాలక్రిష్ణ, నాగరాజురెడ్డి, సదాశివరరెడ్డి, నాగేంద్ర, క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 19 : తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం స్థానిక సిబ్బందితో సమావేశమై రికార్డుల నిర్వహణపట్ల ఆరాతీశారు. కార్యాలయంలో ఉన్న రికార్డులు భద్రంగా ఉంచుకోవాలంటూ ఎలాంటి తప్పిదాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. అదేవిధంగా గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. 1బి, పాసుపుస్తకాలు, సర్వేలకు సంబంధించిన సమస్యలపై సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

కోల్‌కతా ఘటనపై ఆందోళనలు



పెనుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



పురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న నృత్యాలయ గురువు

పెనుకొండ, ఆగస్టు 19: కోలకతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్, కార్యదర్శి నాగార్జున, పునీత్, హరి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. వైద్య విద్యార్థిని కుటుంబాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హిందూపురం అర్బన్: దేశంలో ఆడపిల్లల రక్షణకు ప్రత్యేక కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిజ్ఞా నృత్యాలయ గురువు చంద్రబాను చతుర్వేది పేర్కొన్నారు. కోలకతాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచార సంఘటన ప్రతి ఆడపిల్ల తల్లితండ్రులను కలిచివేసిందన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని పిల్లలతో కలిసి మేళాపురం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు సోమవారం కొవొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

మడకశిరటౌన్: కోలకతాలో వైద్య విద్యార్థిపై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ, సీపీఎం నాయకులు జూనియర్, ఒకేషనల్ కళాశాల విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి అమరాపురం బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈసందర్భంగా సీపీఐ నాయకురాలు ఆర్‌జీ పవిత్ర, పీడీఎస్‌యూ నాయకులు, కళాశాల విద్యార్థులు వైద్య విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

అగళి : కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ, నిందితులను కఠినంగా శిక్షించాలంటూ సోమవారం రాత్రి ఆర్డీటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. అగళి బస్టాండ్‌లో మహిళా సంఘం సభ్యురాళ్లతో కలిసి కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. చేపట్టారు. ఆర్డీటీ ఏటీఎల్ ఓబొలేసు, సీఈఓ వెంకటేశులు, సీఓ శివ ప్రసాద్, హనుమంతరాయుడు, సీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మడకశిరలో విద్యార్థుల మానవహారం



అగళిలో కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన

ఘనంగా ఉపాకర్మ



నూతన యజ్ఞోపవీత ధారణ చేస్తున్న బ్రాహ్మణులు

పెనుకొండ, ఆగస్టు 19: పట్టణంలోని ఆదిశంకరాచార్య మఠంలో సోమవారం ఘనగిరి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉపాకర్మ(నూతన యజ్ఞోపవీత ధారణ) ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా మఠంలో వేదబ్రహ్మ పంచాంగం నాగప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో సామూహికంగా నూతన యజ్ఞోపవీత ధారణ గావించారు.

అక్కదేవతల సమారాధన ఉత్సవం



అక్క దేవతలకు ప్రత్యేక పూజలు చేస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, ఆగస్టు 19: పట్టణ సమీపంలోని మడకశిర చెరువుపై వెలిసిన అక్కదేవతల సమారాధన ఉత్సవాన్ని సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి రాధాకృష్ణ, జిల్లా నాయకులు పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మడకశిర చెరువుకు పుష్క లంగా నీరు రావడంతో గంగ పూజ చేశారు.

చెరువులకు జలకళ



మరవ పారుతున్న పాపిరెడ్డిపల్లి చెరువు

హిందూపురం(సోమందేపల్లి), ఆగస్టు 19 : మండలంలోని చెరువులు, కొండలు, చెక్‌డ్యామ్ లు నీటితో కళకళలాడుతున్నా యి. కొన్ని చెరువులు నిండి, మరవలు పారుతున్నాయి. అదే విధంగా నల్లగొండ్రాయన పల్లి వద్ద ఫారెస్ట్ అధికారులు నిర్మిం చిన చెక్‌డ్యామ్ కట్ట తెగడానికి సిద్ధంగా ఉంది. సోమందేపల్లి చెరువు సగం నిండగా మండ లంలో దాదాపు అన్ని చెరువులకు నీరు చేరింది. మరో రెండువర్షాలు కురిస్తే అన్ని చెరువులు మరవపారే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎం రాయాపురం గ్రామంలో వాంతులు, విరేచనాలు

రొళ్ల, ఆగస్టు 19: మండలంలోని ఎం.రాయాపురం గ్రామంలో సోమవారం అతిసారంతో 25 మంది మంచానపడ్డారు. విషయం తెలుసుకొన్న టీడీపీ నాయకులు హడాహుడిగా పంచాయతీకి చేరుకొని రోగులను పరామర్శించారు. వైద్యులను గ్రామానికి పిలిపించి వైద్యసేవలు అందేవిధంగా చూశారు. టీడీపీ మండల కన్వీనర్ దాసిరెడ్డి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, నాయకులు రామకృష్ణ, యోగానంద్, ఉగ్రేగౌడ్, సిద్ధగంగప్ప, రామచంద్రప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ గిరియప్ప, ఎల్‌బీసీ నాగభూషణ్, తదితరులు రోగులకు వైద్యసేవలు అందించేందుకు సహకారం అందించారు.

తెగిన కాలువకు మరమ్మతులు



తెగిన కాలువకు మరమ్మతులు చేస్తున్న టీడీపీ నాయకులు

చిలమత్తూరు, ఆగస్టు 19: ఇటీవల కురుస్తున్న వర్షాలకు చిలమత్తూరు పెద్ద చెరువు కాలువ తెగిపోయి నీరు వృథా అవుతుండటంతో టీడీపీ నాయకులు సోమవారం స్పందించారు. ఈమండల కన్వీనర్ రంగారెడ్డి, బేకరీ గంగాధర్ స్థానిక టీడీపీ నాయకులు, ఇరిగేషన్ అధికారులతో కలిసి కాలువకు మరమ్మతు పనులు చేపట్టారు. వర్షాలు తగ్గిన తరువాత చెరువు అభివృద్ధి పనులు చేపడుతామని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ

గోరంట్ల,, ఆగస్టు 19: మండలంలోని మల్లాపల్లి ఉన్నతపాఠశాలలో 11మంది గ్రామీణ విద్యార్థులకు టీడీపీ నాయకులు సోమవారం ఉచితంగా సైకిళ్లు అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో విద్యావకాశాలు మెరుగుపరచడానికి టీడీపీ నాయకులు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహప్ప ఆరు సైకిళ్లు, మల్లాపల్లి ఫిరోజ్ బాషా ఐదు సైకిళ్లను సొంత ఖర్చుతో సమకూర్చి, అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయసింహ రావు, టీడీపీ నాయకులు రామాంజనేయరెడ్డి, గంగిరెడ్డి, ఎర్రగంగిరెడ్డి, వెంకటరెడ్డి, శివశంకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసన



రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే వెంకటేశ్, కాంగ్రెస్ కార్యకర్తలు

పావగడ, ఆగస్టు 19 : ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై రాష్ట్ర గవర్నర్ తావర్చంద్ గెహ్లోట్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ పావగడలో కాంగ్రెస్ పార్టీ పావగడ బ్లాక్ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు మధ్యాహ్నం 12గంటలకు ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ ర్యాలీలో హెచ్‌వీ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా పేరుగాంచిన సిద్దరామ య్యపై ముడాలో అక్రమంగా ఇంటి స్థలాలు పొందారనే ఆరోపణలతో ప్రాసిక్యూషన్‌కు అనుమతించిన గవర్నర్ తీరు రాజ్యాంగానికి వ్యతిరేకమ న్నారు. వెంటనే గవర్నర్ చేపట్టిన అనుచిత నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని లేని ప క్షంలో రాష్ట్రస్థాయిలో పెద్దఎ త్తున ధర్నా చేపడతామని ఆ యన హెచ్చరించారు. వంద లాది మంది కాంగ్రెస్ కార్యక ర్తలు, నాయకులు పాల్గొన్నారు.